# అంతమ్మ శపథం



"అంతమ్మా! నే చెప్పేది వింటున్నావా! సంవత్సరానికి 12 వందలిస్తా! ఒక జత కొత్త బట్టలు కుట్టిస్తా! ఇక మధ్యమధ్యలో అంటూ నా పాత బట్టలు నీ కూతురికే కాదు, నీకూ ఇస్తుంటా... నీ కూతుర్ని నాతో పంపించు!"

కాంతామణి చీర సవరించుకుంటూ అంతమ్మకు ఆశ చూపించటానికి ప్రయత్నించింది.

కానీ...

"అది నన్నొదిలి ఉండలేదమ్మా! దానికి 4 ఏళ్లు రాకుండానే దాని తండ్రి చనిపోయాడు. దానికి తల్లీ, తండ్రీ నేనేయై సాకినా! అది నన్నొదిలి ఉండదమ్మా! పైగా... అది అగపడకపోతే కూడు నోటికాడికి పోదమ్మా!"

ఎలాగైనా కూతుర్ని కాంతామణి వెంట పంపడం ఇష్టంలేని అంతమ్మ ఏవో సాకులు చెప్పింది. పైగా... కాంతామణి పనివాళ్ళని నానా బధాలు పెడుతుందనీ, తిండి అసలే పెట్టదనీ.., మధ్యమధ్యలో కోపంతో రెచ్చిపోయి చావకొడుతుందనే వార్తలు అంతమ్మకి తెలిసింది.

అంతమ్మ చెప్పిన కారణాలు కాంతామణికి ఏమంత బలంగా లేవనిపించింది. డబ్బుకు లొంగని వాళ్ళు ఎవరూ ఉండరనీ, అందులో అంతమ్మ లాటివారు ఇట్టే తన బుట్టలో పడతారని కాంతామణి నమ్మకం! అందుకే సిద్ధంగా పెట్టుకున్న మరికొన్ని మాటలు తూటీరాల్లా వదిలింది.

"అంతమ్మా... నీ కూతురు మీద నీకెంత ప్రేమో నాకు తెలుసు. కాని, నీ సంసారం సంగతి ఆలోచించుకో! నీ చుట్టూ అన్నీ అప్పులే కదా! ఎన్ని ఇళ్ళల్లో పాచిపని చేసినా, అంట్ల గిన్నెలు తోమినా మీ తిండికే చాలదు... అవునా? డబ్బు మిగిల్చి అప్పులు తీర్చగలవా? దానికి పెళ్ళెలా చేస్తావు? నువ్వే ఆలోచించుకో! పైగా... మరో 300 పెంచి 15 వందలిస్తా! అదికూడా నిన్ను చూసి జాలిపడి.., తెలిసిందా!" కాంతామణి మాటలన్నీ పొందిగ్గా, జాలి గొలిపిస్తూ సాలెగూడులా అల్లింది. ఈగలా అంతమ్మ అందులో చిక్కుకుంటుందని ఆమె నమ్మకం.

ఆమె ఆలోచన అందులో వమ్ము కాలేదు. ఈసారి నిజంగానే అంతమ్మ ఆలోచించింది. 'పెద్దపిల్ల పెళ్ళికి అప్పులు చేసింది. చిట్లు కట్టి కడుపు కాల్చుకుని అప్పులు తీరుస్తూనే ఉంది. అయినా... ఇంకా ఎక్కడా దారీతెన్నూ కనపడలేదు. ఎన్నాళ్లు పస్తులుండగలదు? ఆవిడ మాట వింటే రెండు సంవత్సరాల్లో అప్పులన్నీ తీరిపోతాయి!' ఆలోచించుకున్న అంతమ్మ కూతుర్ని ఆమె వెంట పంపించడానికే నిర్ణయించుకుంది.

"నీ యిష్టమమ్మా!" అంటుంటే అంతమ్మ గుండెలు బరువెక్కాయి. కళ్ళలో సుళ్ళు తిరిగిన కన్నీళ్లను అదిమిపెట్టి మామూలుగా ఉండటానికి శక్తిని కూడగట్టుకుంది.

"అంతమ్మా! ఇదిగో... నేను వెంటనే బయలుదేరాలి! వెళ్లి పిల్లని పిల్చుకురా!" అంది... చేతి గడియారం చూసుకుంటూ. అంతమ్మ కదలలేదు. తలవంచుకు నిలబడింది.

"మర్చేపోయా! ఇదిగో... ఎడ్వాన్సు!" కాంతామణి చేతిలోని 500 రూపాయలు అందుకుని అంతమ్మ కూతుర్ని పిలుచుకు రావడానికి వేగంగా అడుగులేసింది.

"నే ఆడుకుంటా! నే రానే!" అంటూ 'నీలి' తోటి పిల్లలతో ఆడుకుంటోంది.

ఎంత బతిమాలినా నీలి ఆట మాని రావడానికి ఇష్టపడలేదు. కోపం పట్టలేని అంతమ్మ కూతురు నడ్డివంచి శక్తి కొద్దీ కొడుతూ లాక్కొచ్చింది. ఎప్పుడో తిన్న ఆకలి బాధ ఒక పక్క మరోపక్క తల్లి కొట్టే దెబ్బల బాధ ఓర్చుకోలేని నీలి గొంతు కీచుపడింది.

"మన బతుకులకి ఆటలేంటే? పొట్ట నిండడమే కష్టం! ఇదిగో... ఆరితో యెల్లు. నీకు కడుపు నిండా తిండేనా దొరుకుతుంది. ఆరింటి సెప్పిన పని ఖచ్చిడిగా సెయ్యాలా!" అంతమ్మ మాటలు నీలికి వినపడ్డాయో, లేదో తెలీదు. ఏ సమాధానమూ చెప్పలేదు. ఏడుపు మానినా వెక్కుతూనే ఉంది.

అంతమ్మ బక్క కోపం పొంగులా చల్లారిపోయింది.

కొట్టిన చేతులు బాధగా చూసుకుంది. పొద్దుట మొదలు తనతో అందరిళ్లల్లో పనులు చేస్తూనే ఉంది. ఇప్పుడే కాస్త తీరిక దొరికి తోటిపిల్లలతో ఆడుకోడానికి పోయింది. 'అనవసరంగా కొట్టా!' మనసు బాధపడుతున్నా కాంతామణి ఎదురుగా ఏమనడానికీ నోరు పెగల్లేదు.

కూతురు ముఖం కడిగి ఓ పాత బట్టతో తుడిచింది. గిన్నెలో అడుగున మిగిలిన అన్నం రెండు ముద్దలు తినిపించింది.

"నే ఆరితో ఎల్లా! నీ కాడే ఉంటా!" నీలి తిరిగి పేచీ ప్రారంభించింది. కాంతామణి ఆమె పేచీ లెక్కచేయకుండా వెళ్లి కార్లో కూర్చుంది.

అంతమ్మ- కసాయివాడు గొఱ్ఱెను లాక్కెళ్లినట్లుగా నీలిని లాక్కెళ్లి కారు వెనకసీట్లో కూర్చోపెట్టింది.

"ఓ అమ్మో! నే ఎల్లనే..!" నీలి ఏడుపు వినబడుతూనే ఉంది.

కారు అంతమ్మ దృష్టిని దాటి దూసుకుపోయింది.

కాంతామణి చెప్పిన మాటలన్నీ గాలిలో కలిసిపోయాయి.

నీలి వెలుగు రాకుండా లేచి పాచిపని మొదలుకొని, అంట్ల గిన్నెలు తోముడు, నాలుగు బకీట్లు బట్టలు ఉతకడం... అన్నీ ఆమె చేయవలసిన పనులే! మధ్యలో కాంతామణి చంటిపిల్ల ఏడుపు వినబడకుండా ఎత్తుకు తిప్పుతోంది. తిరిగి రాత్రి ఏ పదో దాటితే కాని, కన్ను మూయడానికి లేదు.

ఆరోజు నీలి ఆకలికి తట్టుకోలేక విలవిల్లాడింది.

"అమ్మా! అన్నం పెడతావా! ఆకలేత్తోందమ్మా!" వీధుల్లో ముష్టివాళ్ళు అడిగేటట్టు కాంతామణిని అడిగింది.

"ఏమే... ఆకలేస్తోందా? వేస్తుందీ ఆకలి? ఆకలి లేకుండా చేస్తానుండు!" అంటూ గరిట కాల్చి బలవంతంగా పొట్టమీద వాతలు పెట్టింది. ఆ మంటల బాధ తట్టుకోలేని నీలి పెట్టిన కేకలు ఆ ఇల్లు దాటి బయటకు రాలేదు.

ఒకరోజు సాయంకాలం చల్లని గాలి వీస్తోంది.

ఆకాశంలో పక్షులు రెక్కలు విప్పి హాయిగా ఎగురుతున్నాయి. ఓ రామచిలుక జామిచెట్టు మీద వాలి పచ్చగా పండిన జామపండు కొరుకుతోంది. చంటిపిల్లను ఆడిస్తున్న నీలి రామచిలుకను రెప్పవాల్చక చూసింది. ఆ జామపండును చూసి నోరు చప్పరిస్తూ అలాగే నిలబడింది. చంకలోని చంటిపిల్ల జారి నేలమీద పడి గుక్క పట్టింది. ఆ పిల్ల ఏడుపుకు ఇంట్లోవారంతా రెచ్చిపోయి పక్కనే ఉన్న ఓ కట్టె తీసుకుని నీలిని ఒళ్ళు తెలీకుండా కొట్టింది. దెబ్బల బాధ పడలేని నీలి నేలకొరిగింది. తల బద్దలై, వీపు చిట్లి, రక్తం కారుతుంటే అందరూ ఆమెను వదలి లోపలికి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు.

ఆ రాత్రి, ఆ చీకట్లో నీలి తెలివిలేకుండా పడిఉంది.

అర్ధరాత్రివేళ... ఎవరిదో, చల్లని హస్తం ఆమెను తాకగానే నీలి కళ్ళు తెరిచింది. 13 సం॥ నీలికి అతనెవరో తెలియదు. అతని వల్ల పొంచిఉన్న ప్రమాదం తెలియదు. అతను ఆమెను లేవదీసి తన పడకగదిలోకి నడిపించాడు. అభం శుభం తెలియని నీలి అతనితో నడిచింది. నీలిరంగు బెడ్ లైటు కాంతిలో మంచం పాము కుబుసంలా మెరిసిపోతుంటే... ఆ వ్యక్తి నీలిని ఆ మంచం మీద కూర్చోపెట్టి బిస్కట్లు తినమని అందించాడు.

ఆకలితో ఉన్న నీలి ఆ పాకెట్టులోని బిస్కట్లన్నీ తినేసింది. అతను అందించిన సీసాలోని మంచినీళ్లు తాగింది. చల్లని ఫ్యానుగాలికి ఆమెకు తల తిరిగి కళ్ళు మూతలు పడ్డాయి. మంచం మీద ఒరిగిపోయింది. రాబోయే ప్రమాదం గుర్తించలేని అమాయకత్వం, అభంశుభం తెలియని వయస్సు నిశ్చింతగా నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారి అందరూ చుట్టూ మూగడంతో నీలి కళ్ళు తెరిచింది.

రాత్రి కాంతామణి కొట్టిన దెబ్బలకు ఎక్కడ నేలమీద పడిఉందో- ఇప్పుడు కూడా అక్కడే పడిఉంది. కాని, ఆమె కట్టిన లంగా అంతా రక్తపు మరకలతో తడిసిఉంది. రాత్రి ఏం జరిగిందో నీలికి ఏమాత్రం గుర్తులేదు.

"ఏమే! దొంగదానా? ఏం జరిగిందో చెప్పవే?" కాంతామణి రెక్క పట్టుకులాగి బలవంతంగా నీలిని కూర్చోపెట్టి గద్దించి అడిగింది. నీలికి అంతా అయోమయంగా అనిపించింది. కడుపులో నొప్పి భరించలేని నీలి- బాధతో మెలికలు తిరిగింది.

"అయ్యో... కాంతామణీ! ఆ బక్క ప్రాణం గుటుక్కు మంటుందేమోనే! ఆసుపత్రికి పంపించవే?" తొందరచేసింది కాంతమణి తల్లి.

కాంతామణికి కూడా భయంవేసింది. రాత్రి కాంతామణి మరిది గదిలో సందడి... ఆవిడ, కాంతామణి కూడా చూశారు. కాని, నోరు మెదపలేదు. ఆ తాగుమోతు వినడని తెలుసు. గట్టిగా అరిస్తే కొంప అల్లరిపాలవుతుంది. చూసీచూడనట్టే ఉండిపోయారు.

కాంతామణి వెంటనే కర్తవ్యం గుర్తించింది. నీలిని ఎలా వదిలించుకోవాలా... అని ఆలోచించింది. ఆమెను తీసుకెళ్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డబ్బు ఎర చూపించి చేర్పించింది. ఆసుపత్రి డాక్టరు మొదట భయపడ్డాడు కాని, ఆమె ఇచ్చిన డబ్బుకి నోరు మెదపలేదు. వచ్చిన పని పూర్తి కాగానే కాంతామణి చేతులు దులుపుకుని ఇంటికి వెళ్లిపోయింది.

ఆరాత్రి అంతమ్మ కంటికి నిద్రలేదు. నిద్రలో నీలి– "అమ్మా! అమ్మా..!" అని పదేపదే పిలిచినట్లయింది. ఆ మగత నిద్రలోనే ఆమెకు తెల్లవారింది. నీలిని పోయి చూడాలని ఆమె మనస్సు తొందరపడింది. రోజులాగే రోడ్డువార బండి దగ్గరకు చాయ్ తాగటానికి పరుగెత్తింది.

"అంతమ్మా! నీ బిడ్డను ఎప్పుడు తోలుకొస్తవే?" అంటూ చాబండి ఎల్లయ్య అడగ్గానే అంతమ్మకు గుండె కదిలినట్లయింది.

"ఇప్పుడే పోతున్ననయ్యా!" అంటూ సమధానమిచ్చిన అంతమ్మ చాయ్ తాగుతుంటే కప్పులో నీలి రూపం కదలినట్లయింది. అంతమ్మ ఉలిక్కిపడింది. తడబడే అడుగులతో చాయ్ పైసలైనా ఇవ్వకుండా బస్సుస్టాండు వైపు కదిలి, బస్సు ఎక్కింది.

సైదాబాదులో బస్సు దిగిన అంతమ్మ– కాంతామణి ఇల్లు చేరి, "నీలి! నీలి!" అంటూ పిలిచింది. ఆ పిలుపు ఇల్లంతా మారుమ్రోగింది. కాని, నీలి జాడలేదు. పైగా... కాంతామణి చూడనట్టే పక్కకు ముఖం తిప్పుకు కూచుంది!

అంతమ్మ మనస్సు ఎందుకో... కీడును శంకించింది. గుండె దడదడలాడింది.

"నా బిడ్డేదమ్మా..?" అంటూ అంతమ్మ దీనంగా అడిగింది.

"జ్వరం వస్తే మంచి మందులిస్తారని ఇదిగో... దవాఖానాలో చేర్పించినా! ఈ డబ్బుంచుకో... అంతమ్మా! కంగారుపడకు!" అంటూ రెండు వందలు అంతమ్మ చేతిలో పెట్టింది. అంతమ్మ అదేమీ పట్టించుకునే స్థితిలో లేదు. దవాఖానా వివరాలు తెలుసుకుని వేగంగా పరుగెత్తింది.

అంతమ్మ దవాఖానాలోని అన్ని గదులూ వెతికింది. ఎక్కడా నీలి జాడలేదు.

చివరకు ఓ గదిలో మూల నీలి నేలమీద మాసిన ఓ పరుపు మీద బల్లిలా అతుక్కుపోయి ఉంది. "అయ్యో! నాబిడ్డా! నీకేమయిందే తల్లీ!" అంటూ అంతమ్మ శోకం ఆ చుట్టుపక్కల రోగులను కలచివేసింది. అంతలో... అక్కడకు విజిట్‌కు వచ్చిన డాక్టరు కాళ్లు పట్టుకుని అంతమ్మ తనబిడ్డను బతికించమని వేడుకుంది. ఆ డాక్టరు మందులు రాసిచ్చి, 'నాలుగురోజుల్లో మామూలు స్థితికి వస్తుంది. ఇంటికి తీసుకువెళ్లవచ్చ'ని చెప్పాడు. అంతమ్మకు అతని మాటల మీద నమ్మకం లేకపోయినా, నమ్మక తప్పలేదు. అక్కడున్న ఓ నర్సు- డాక్టరు వెళ్లగానే అంతమ్మకు అసలుసంగతి వివరించింది.

కోపంతో రెచ్చిపోయిన అంతమ్మ ఎదురుగా కాంతామణి కనుక ఉండిఉంటే- ఆమె పీక నొక్కేదే! అంతలోనే కూతురి సంగతి గుర్తుకొచ్చి కూతుర్ని పట్టుకొని గుండెలు అవిసేలా ఏడ్చింది. ఆ అనంతమైన శోకసంద్రంలో బడబాగ్నిలా కోపాగ్ని రగిలింది. ఎక్కడలేని బలం పుంజుకొంది. నీలిని భుజాన వేసుకొని పోలీసుస్టేషన్‌కి పరుగుపెట్టింది.

పోలీసులు ముందు ఆమెను లోపలికి రానీయలేదు. పైగా... కేసు నమోదు చేసుకోడానికి ఇష్టపడలేదు. అప్పటికీ అంతమ్మవాడలోని జనమంతా పోలీసులను చుట్టుముట్టారు. దవాఖానాలో పనిచేస్తున్న యాదగిరి అంతమ్మ ఇంటిపక్కనే ఉంటాడు. యాదయ్య పరుగెత్తుకొచ్చి నీలి సంగతి చెప్పాడు. ఆ వార్త వాడంతా గుప్పుమంది.

పోలీసులకు కేసు నమోదు చేసుకోక తప్పలేదు. కాంతామణిని, డాక్టర్ని కూడా స్టేషన్‌కు తీసుకురాక తప్పలేదు. ఇద్దరికీ జైలుశిక్ష పడింది. నీలికి జరిగిన ఘోరానికి ఆ బస్తీ వాళ్ళంతా కన్నీళ్లు పెట్టుకున్నారు.

"నీలి వెళ్లనంటే బలవంతంగా నువ్వే పంపించావు. ఎంత పని జరిగిందో చూశావా?" అప్పుడే అక్కడకు వచ్చిన టీచరమ్మ మందలించింది.

అంతమ్మలో ఆవేశం పొంగివచ్చింది.

"నే బతికుండగా మరెవ్వరి పిల్లల్ని ఇల్ల లోపలికి ఎల్లనివ్వ!" అంతమ్మ శపథం అందరికీ నచ్చింది.

"ఓయమ్మా! నే ఆడుకోబోనే! ఇగ నన్నెవరి కాడికి పంపబోకే! ఆ టీచరమ్మ కాడ కెల్లి సదువుకుంటానే!" అంటున్న నీలిని వాటేసుకుంది అంతమ్మ.

అక్కడున్న వారందరి కళ్ళల్లోనూ ఆనందబాష్పాలు మిలమిల మెరిశాయి.